క్లుప్తంగా

అనధికార కాంట్రాక్ట్ పనులపై డీఈఈకి ఫిర్యాదు



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే జనరల్ ఇన్స్టిట్యూట్‌కు సంబంధించిన రైల్వే కమ్యూనిటీ హాల్‌లో కొన్ని అనధికార కాంట్రాక్ట్ పనులు నడుస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సభ్యులు తెలిపారు. ఈమేరకు ఎలక్ట్రిక్ లోకోషెడ్ సీనియర్ డీఈఈకి శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘ్ వర్కింగ్ కమిటీ సభ్యులు చింత మురళి, సాధినేని వెంకటనారాయణ, నాయకులు పాక రాజ్‌కుమార్, ముస్తాక్, అభిలాష్, జగదీష్, లక్ష్మీనారాయణ, కోటేశ్వర్, బల్విందర్‌సింగ్, పరమేశం పాల్గొన్నారు.

బెస్ట్ పోస్టర్ అవార్డు గ్రహీతకు సన్మానం



కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లో ఈనెల 4నుంచి 6వ తేదీ వరకు మ్యాగ్నటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల (కోఎడ్యుకేషన్) కాంట్రాక్టు అధ్యాపకుడు సాయిమనీష్ పాల్గొని పోస్టర్‌ను ప్రజెంటేషన్ చేసి ప్రతిభ కనబరిచారు. ఈమేరకు అతడు బెస్ట్‌పోస్టర్ అవార్డులో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. కాకతీయ యూనివర్సిటీలో అతనిని వీసీ తాటికొండ రమేష్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి శుక్రవారం అభినందించారు.

బాలాజీకి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు లకావత్ బాలాజీకి యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. పర్ఫార్మెన్స్ ఆఫ్ మోడల్ స్కూల్స్ ఇన్ తెలంగాణ స్టేట్ ఏ కేస్ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి బాలాజీకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వీరన్న పర్యవేక్షణలో బాలాజీ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లుగానే దివ్యాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించాలని దివ్యాంగ సామాజిక వేదిక వ్యవస్థాపకుడు, దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా దివ్యాంగుల హక్కుల చట్టం -2016ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

నేడు కిట్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రతిభ కనబరిచిన 14మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేసి సన్మానించనున్నట్లు వివరించారు. కార్యక్రమానికి ఎల్‌బిటీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ అమర్‌నాథ్, కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

వీర సైనికుడికి ఘన నివాళి



హన్మకొండ: దేశ రిటైర్డ్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్‌కు బీఆర్ఎస్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, హనుమాన్‌నగర్ -1 వాసులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం అసువులు బాసి, వీర మరణం పొందిన సైనికుడు బిపిన్ రావత్ అని కొనియాడారు. కార్యక్రమంలో మొట్ల మనోహర్, సాదుల రఘుపతి, కుమార్‌రెడ్డి, పవన్, రాజ్‌కుమార్, వెంకటేష్, రవికిరణ్, శ్రీకాంత్, అమర్ పాల్గొన్నారు.

బాల మేధావులను గుర్తించాలి

శాయంపేట : బాలల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని బాలమేధావులుగా తీర్చిదిద్దాలని యూనిట్ మేనేజర్ ప్రియాంకరెడ్డి సూచించారు. శాయంపేట మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ అందించిన ఆర్థిక సాయంతో ఎఫ్‌పీసీఎల్ బీసీఐ ప్రాజెక్టు ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.

కార్తీక బహుళ ఏకాదశి పూజలు



రుద్రేశ్వరాలయంలో లక్ష తులసీ బిల్వార్చన



మెట్టుగుట్టపై సామూహిక సత్యనారాయణ వ్రతం



వరంగల్ చౌరస్తా: రత్నగర్భ గణపతి ఆలయంలో..

హన్మకొండ కల్చరల్: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం కార్తీక బహుళ ఏకాదశిని పురస్కరించుకుని రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో లక్ష తులసీ బిల్వార్చన నిర్వహించారు. ఏకాదశి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితుడు మణికంఠ శర్మ, అర్చకులు ప్రణవ్, మేఘనాథాచార్యులు సుప్రభాత సేవ, ఉత్తిష్ట గణపతికి ఆరాధన, రుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. శివ, విష్ణు ప్రీతికరమైన మారేడు, తులసీ దళాలతో అర్చన చేశారు. మహా నివేదన, మహా హారతి, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ దేవాలయంలో శనివారం ఉదయం 11గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మెట్టుగుట్టపై సామూహిక రుద్రాభిషేకం

మడికొండ: కార్తీకమాసంలో భాగంగా మడికొండలోని మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి శుక్రవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. రామాలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య జరిపించారు. సాయంకాలం ఆకాశ దీపోత్సవం నిర్వహించి, ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వాహణాధికారి శేషుభారతి, అర్చకులు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ భక్తులు పాల్గొన్నారు.



శ్వేతార్కుడికి గోదావరి జలంతో అభిషేకం

గణపతి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27వ డివిజన్ దయానంద కాలనీలోని రత్నగర్భ గణపతి దేవాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కురవి రాజేశ్వరశర్మ, అర్చకుడు సాయి ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామికి విశేష పూజలతో వ్రతం చేశారు. రత్నగర్భ గణపతి ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షుడు దొడ్ల పోలయ్య, కార్యదర్శి దనేకుల రాంబాబు, కోశాధికారి కంతేటి హరికృష్ణ, సహాయ కార్యదర్శి కాపా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు ఉప్పుల శ్రీనివాస్ దంపతులతో పాటుగా 45 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి గోదావరి జలంతో అభిషేకం

కాజీపేట: కార్తీక మాసోత్సవం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి గోదావరి నది జలంతో సహస్ర అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజలు ఘనంగా జరిపించారు. శ్వేతార్కుడికి భక్తులు సమర్పించిన నెయ్యితో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. అనంతరం, భక్తులకు అన్నపూర్ణ భవనంలో అన్నదానం చేశారు.

'మల్లికాంబ' సేవలు అభినందనీయం



లంబాడి వేషధారణలో ఉన్న దివ్యాంగులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: దివ్యాంగుల్లో మానసిక పరిపక్వత వచ్చేలా కృషి చేస్తూ, వారి అభ్యున్నతి కోసం మల్లికాంబ మనోవికాస కేంద్ర నిర్వాహకులు, సిబ్బంది చేస్తున్న విశేష సేవలు అభినందనీయమని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రశంసించారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరై మాట్లాడుతూ మానసిక దివ్యాంగులను ఇంత అందంగా తయారు చేసి వారిని చూపించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మల్లికాంబ సంస్థకు తమ తరఫున ఎల్లప్పుడు సహాయ సహకారాలు ఉంటాయని భరోసా ఇచ్చారు. సామాజిక స్పృహతో వారిని ఓర్పుతో సాకుతూ విద్యాబుద్ధులు నేర్పిస్తూ, మానసిక పరిపక్వత వచ్చేలా కృషి చేస్తున్న నిర్వాహకులు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలో పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి మధురిమ, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల, ప్రొఫెసర్ పద్మ, సదానందం, కోడం కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

వీరు మారరు!

- జూనియర్ అసిస్టెంట్ నుంచి ఎంపీడీఓ వరకు గైర్హాజరు
- బోసిపోయిన మండల పరిషత్ కార్యాలయం



ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపీడీఓ కుర్చీ

హసన్‌పర్తి: ప్రభుత్వం మారినా అధికారుల తీరు మాత్రం మారడం లేదు. మధ్యాహ్నం 12 గంటలు అయినప్పటికీ అధికారులు, సిబ్బంది ఎవరూ రాలేదు. ఇదీ హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వెలుగు చూసిన సంఘటన. వివిధ పనుల నిమిత్తం పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఉదయం 10గంటలకు కార్యాలయానికి వచ్చారు. మధ్యాహ్నం కావస్తున్నా అధికారులు ఎవరూ రాలేదు. ఈక్రమంలో మండల పరిషత్ కార్యాలయాన్ని 'సాక్షి' పరిశీలించగా కార్యాలయం బోసిబోయి కనిపించింది. రోజు ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి అధికారులు, సిబ్బంది హాజరుకావాల్సి ఉంది.

కుర్చీలు ఖాళీగా..

మధ్నాహ్నం వరకూ అధికారులు ఎవరు రాలేదు. జూనియర్ అసిస్టెంట్, టైపింగ్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, పీపీఓ, ఎంపీడీఓతో పాటు ఏపీఓ, ముగ్గురు టీఏలు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నలుగురు గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల కుర్చీలు ఖాళీగా కనిపించాయి.

అమలు కాని టూర్ డైరీ

ఎగ్జిక్యూటివ్ హోదా గల అధికారులు తప్పనిసరిగా టూర్ డైరీ అమలు చేయాల్సి ఉంటుంది. కానీ అవేమీ ఇక్కడ అమలుకావడం లేదు. ఎగ్జిక్యూటివ్ హోదాలో కొనసాగుతున్నా తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో అధికారి నెలకు రూ.లక్షల జీతం తీసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎంపీఓ గది



ఏపీఓ గది

దేశభక్తిని పెంపొందించుకోవాలి

హసన్‌పర్తి: ప్రతీ విద్యార్థి దేశభక్తి, సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ సూచించారు. వడ్డెపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు రక్షణ సమితి, విద్యారణ్యపురి ఆధ్వర్యంలో 'సంస్కార వికాస శిక్షణ' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన ఆలోచనలు చేస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని చెప్పారు. ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని తదనుగుణంగా, ప్రణాళికబద్ధంగా చదివితే గమ్యాన్ని చేరుకోవచ్చని వివరించారు. విద్యార్థి దశలో తప్పుడు ఆలోచనలు, దురలవాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామోదర్

కాంగ్రెస్‌తో సమస్యలు పరిష్కారం అవుతాయి

వరంగల్: ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన తెలంగాణ ప్రజా ప్రభుత్వంతో ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడం రవిప్రకాశ్, ధర్మదేవ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నూతన ప్రమాణ స్వీకారం చేసిన సీఎంతో పాటు మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల వివిధ పెండింగ్ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదల, బకాయిల విడుదల, నూతన పీఆర్‌సీ సత్వరమే అమలు వంటి సమస్యలు పరిష్కరం అవుతాయని పేర్కొన్నారు.

ఆదివాసీల హక్కులను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

నయీంనగర్: స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా ఆదివాసీ గూడేల్లో ఇంకా కనీస సౌకర్యాలు కరువయ్యాయని, వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆదివాసీ సంఘాల జేఏసీ కన్వీనర్ ఈసం సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస సౌకర్యాలు కల్పిస్తూ, వారి హక్కులను కాపాడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలస గిరిజనేతరులను మైదాన ప్రాంతానికి తరలించాలని, వక్రమార్గంలో లంబాడీలు ఎస్టీ సర్టిఫికెట్ పొందుతూ తమ ఉద్యోగాలను లాక్కుంటున్నారని వాపోయారు. ఎస్టీ జాబితాలో కలిపిన 11 బీసీ కులాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 474 గ్రామాలకు షెడ్యూల్ హోదా కల్పించి అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని, పోడు భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని, బెల్టు షాపులు తొలగించాలని, ఆదివాసీ పీసా చట్టాలను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ సంఘాల నాయకులు దబ్బకట్ల సుమన్, వీరస్వామి, ఈక నాగేశ్వర్‌రావు, సిద్ద బోయిన భాస్కర్, పడిగ నాగేశ్వర్‌రావు, లింగాల కిరణ్‌కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మైరాకు అభినందనలు



విద్యార్థిని సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

రామన్నపేట: ఎంజీఎం ఆస్పత్రి గేటు వద్ద చాయ్ విక్రయిస్తున్న పాషా కూతురు అలీజా మైరా.. జిల్లా స్థాయిలో టాటా గ్రూపు ఆఫ్ కంపెనీ నిర్వహించిన ఎస్ఏ రైటింగ్‌లో బంగారు పతకం సాధించడంపై భారతి చారిటబుల్ ట్రస్టు సభ్యులు శుక్రవారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. రామన్నపేటలోని ట్రస్టు కార్యాలయంలో చిన్నారిని శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు ఎండీ.రాజేంద్రప్రసాద్, తండ్రి అఫ్జల్‌పాషా, జన్ను మాణిక్యం, శ్రీను, శబరి, ఖాదర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

శాయంపేట : ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సరిత ప్రకటనలో తెలిపారు. సాయిశ్రుతి, లహరి, సానియాకౌశ్ర, అర్పిత ఎంపికైనట్లు వివరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కాజీపేట రూరల్: నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన పల్లందాసు మంజుల (35) అనే దళిత మహిళను అత్యంత దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిలువేరు విజయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. కాజీపేట బాపూజీనగర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత మహిళలపై దారుణమైన సంఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులు యథేచ్ఛగా తిరుగుతున్నారని వాపోయారు. సమావేశంలో భూషపాక శ్రీనివాస్, సదరం మహేష్, నర్మెట్ట వేణు, కటూకురి శ్రీనివాస్, పోకల చంద్రశేఖర్, మల్లేష్‌కుమార్, జానీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుపై హర్షం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో హర్షం వ్యక్తం చేస్తూ కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద శుక్రవారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకుల సంఘం బాధ్యులు మామిడి లింగయ్య, చిర్ర రాజు, ప్రవీణ్‌కుమార్, జితేందర్, మాదాసి కనకయ్య, పుల్లా రమేష్, సతీష్‌కుమార్, జూల సత్యం, ప్రసాద్, శ్రీలత, సునీత తదితరులు పాల్గొన్నారు.

'నాయిని'కి సముచిత స్థానం కల్పించాలి

కాజీపేట: దాదాపు మూడున్నర దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పించాలని హనుమకొండ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ చల్లా వాసుదేవారెడ్డి విజ్ఞప్తి చేశారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం రానప్పటికీ ఓపిక, సహనంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించడంతో పాటు పార్టీ బలోపేతానికి నాయిని చేసిన కృషిని గుర్తించాలని కోరారు.

రేపు 'గోపా' కార్తీక వన భోజనాలు



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు

కాజీపేట అర్బన్: ఈనెల 10వ తేదీన గోపా 21వ కార్తీక వన భోజనాలను ఖిలా వరంగల్ మధ్యకోటలోని చిల్డ్రన్స్ పార్కులో నిర్వహించనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల గోపా అధ్యక్షులు బైరి లక్ష్మీనారాయణ గౌడ్, చిర్ర రాజుగౌడ్ తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని గోపా భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్తీక వన భోజనాల్లో గౌడ కులస్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపా నాయకులు భీమగాని లక్ష్మీనారాయణ, కుమారస్వామి, సురేష్, ఉపేందర్, సురేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు సన్మానం



వరంగల్: మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొండా సురేఖను టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, పలువురు నాయకులు హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

యూనియన్‌ను బలోపేతం చేయాలి





కేక్ కట్ చేస్తున్న ఇనుగాల శ్రీధర్

హన్మకొండ : తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్‌ను మరింత బలోపేతం చేయాలని యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో టీఎస్ఈఈయూ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని యూనియన్ నాయకులు, కార్మికుల మధ్యలో విద్యుత్ ఉద్యోగులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, నాయకులు నీలం ఐలేష్, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, తులసి, రాజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, సదయ్య, బుచ్చయ్య గౌడ్, ఓదేలు, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హన్మకొండ అర్బన్: ఇనుగాల శ్రీధర్‌కు హనుమకొండ రూరల్, టౌన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, అమరేందర్ రెడ్డి, ఉమేష్, తదితరులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

భట్టి విక్రమార్కకు శుభాకాంక్షలు



హసన్‌పర్తి: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన భట్టి విక్రమార్క మల్లును కిసాన్ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేషణ్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.